ప్రజాశక్తి

మంగళవారం 19 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పంట నష్టపరిహా(ర)సం

- పూర్తయిన పంట నష్టం నమోదు ప్రక్రియ
- తుది జాబితాల రూపకల్పనలో యంత్రాంగం
- నేడు సచివాలయాలలో ప్రదర్శన

తెనాలిలో మండలంలో నీటిలో తేలియాడుతున్న వరి (ఫైల్)

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మిచౌంగ్ తుపాను వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జరిగిన పంట నష్టంపై వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చేపట్టిన ఎన్యుమరేషన్ సోమవారం సాయంత్రం ముగిసింది. వివరాలను మంగళవారం నుండి సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచనున్నారు. నిబంధనలను సాకుగా చూపి పంట నష్టంను తక్కువగా చూపేందుకు అధికారులు ప్రయత్నించినట్లు తెలిసింది. నిబంధనలు సడలించి రైతులను ఆదుకుంటామని సిఎం జగన్ హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో నిబంధనలు కఠినంగా అమలు చేశారు. రెండు జిల్లాల పరిధిలో 2.25 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాల్లో నిర్ధారించారు. ఎన్యుమరేషన్‌లో మాత్రం కేవలం 1.40 లక్షల ఎకరాలలోనే నష్టం జరిగినట్లు అంచనాలకు వచ్చినట్లు తెలుస్తోంది. అంతేగాక కొన్ని పంటలు ప్రాథమిక దశలో ఉన్నందున పరిహారం రాదని కేవలం సబ్సిడీపై విత్తనాలు వస్తాయని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో 21 వేల ఎకరాలు,పల్నాడు జిల్లాలో 9 వేల ఎకరాల్లో శనగ పంటకు నష్టం జరిగింది. ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టిన శనగ రైతులకు నిరాశ మిగిలింది. పైరు ప్రాథమిక దశలో ఉన్నందున పరిహారం రాదని కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ కింద 80 శాతం సబ్సిడీతో విత్తనాలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో శనగ రైతుల ఆందోళనకు గురవుతున్నారు. పల్నాడు జిల్లాలో 8500 ఎకరాలలో వరికి నష్టం జరిగింది. 2 వేల ఎకరాల్లో వరి పూర్తిగా నీట మునిగింది. మరో 6500

▶ 2లో

వారి స్థానంలో ఎవరొచ్చినా పిల్లల్ని పంపించం

- అధికారులు ఎదుట స్పష్టం చేసిన తల్లులు
- తాళాలు పగలగొట్టడానికి వచ్చిన అధికారులకు పలుచోట్ల ప్రతిఘటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

అగన్వాడీల సమ్మె నేపథ్యంలో కేంద్రాల తాళాలను అధికారులు పగలగొట్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే పలుచోట్ల వారి చర్యలను స్థానికులు, సిపిఎం, టిడిపి, జనసేన, ప్రజా సంఘాల నాయకులు అడ్డుకుంటున్నారు. సోమవారం మండల కేంద్రమైన దుగ్గిరాల అలినగర్‌లో కేంద్రం తాళాలను పగలగొట్టడానికి అధికారులు రాగా స్థానిక మహిళలు, అంగన్వాడీల అడ్డుకున్నారు. కేంద్రం ఎదుటే బైఠాయించారు. అంగన్వాడీల స్థానంలో ఎవరొచ్చిన తమ పిల్లల్ని కేంద్రాలకు పంపించబోమని పలువురు మహిళలు స్పష్టం చేశారు. తాళాలైతే పగలగొడుతున్నారుగాని పిల్లలకు సరైన ఆహారం పెట్టారా? గర్భిణులు, బాలింతలకు రేషన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. అద్దె భవనంలో

దుగ్గిరాలలోని అలీనగర్లో అంగన్వాడి కేంద్రం తాళాలు పగలగొట్టకుండా అడ్డుకున్న అంగన్వాడీలు, స్థానికులు

ఆ కేంద్రం నిర్వహిస్తుండంతో యజమాని సైతం తమకు 10 నెలల అద్దె బకాయిలివ్వాలని ఎదురు తిరగడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ఉదయం 9

▶ 2లో

రైతు, కౌలు రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

8 పేజీ

గుంటూరులో ఆకులు తింటూ నిరసన, నరసరావుపేటలో నిరసన ప్రదర్శనలో అంగన్వాడీలు

7వ రోజుకు అంగన్వాడీల సమ్మె

చెట్ల కొమ్మలు నోట్లో పెట్టుకొని వినూత్న నిరసన - నరసరావుపేటలో ప్రదర్శన ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడాన్ని అడ్డుకుంటామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు కొనసాగిస్తున్నారు. గుంటూరులో ఆకులు తిని నిరసన తెలపడంతోపాటు జెసికి వినతిపత్రం ఇచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో భారీ ప్రదర్శన, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇచ్చారు.

గుంటూరులో అంగన్‌వాడీల సమ్మె 7వ రోజుకు చేరుకున్న సందర్భంగా కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో సోమవారం వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో సమ్మె శిబిరానికి తరలివచ్చారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చెట్ల ఆకులు నోట్లో పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు పగులగొట్టవద్దని కోరుతూ స్పందనలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒకవైపు మంత్రులు తాళాలు పగులగొట్టాలని చెప్పలేదని ప్రకటిస్తున్నారని, మరోవైపు క్షేత్ర

▶ 2లో

గిరిధర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం

తనకు సహకరించాలని కోరిన మంత్రి రజనీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు పశ్చిమ టిక్కెట్ దక్కని ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌ను శాసన మండలికి పంపుతామని సిఎం జగన్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన సిఎం జగన్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. పార్టీకి సేవలను ఉపయోగించుకుంటామని, వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని జగన్ చెప్పారు. అయితే 2025 వరకు ఎమ్మెల్సీలకు ఎన్నికలు జరిగే అవకాశం లేని దృష్ట్యా గిరిధర్ కొంత అసంతృప్తి గురైనట్లు తెలుస్తోంది. టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి వైసిపిలోకి వచ్చిన ఆయనకు మరోసారి పోటీ చేసే అవకాశం ఇస్తారని ఆశించినా అనూహ్యంగా ఆయన స్థానంలో మంత్రి రజనీకి అవకాశం కల్పించారు. ఇక్కడ కాకున్నా తెనాలి లేదా సత్తెనపల్లిలో అవకాశం ఇస్తారని భావించినా అవీ దక్కలేదని, ఎమ్మెల్సీ పదవి హామీతో సరిపెట్టారని గిరిధర్ అనుచరులు చెబుతున్నారు. మరోవైపు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్తగా ఇప్పటికే రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించిన మంత్రి రజనీ సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గిరిధర్ నివాసానికి వెళ్లి ఆయన్ను, ఆయన భార్యను కలిశారు. పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరగా సహకరిస్తానని గిరిధర్ హామీనిచ్చారు.

గిరిధర్‌తో మాట్లాడుతున్న రజిని

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చే దాక ఉద్యమం

- రూపాయి ఖర్చు లేకున్నా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం
- మూడో రోజు దీక్షల ప్రారంభంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- సిపిఎం రిలే దీక్షలకు వివిధ సంఘాల మద్దతు

మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - మంగళగిరి

ఏన్నో ఏళ్లుగా 20 వేల మంది పేదలు మంగళగిరి నియోజకవర్గంలోని వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నారని, వారందరికీ పట్టాలిచ్చే వరకూ అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాలు, పట్టాల అంశంపై స్థానిక మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ

▶ 2లో

తాడేపల్లి రూరల్ ప్రాంతాల్లో కేంద్రాల వద్ద ప్రతిఘటన

వారి స్థానంలో ఎవరొచ్చినా పిల్లల్ని పంపించం

(మొదటి పేజీ తరువాయి)

గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు తాము సేవలందిస్తున్నా అరకొర జీతాలే ఇస్తున్నారని, మిగతా శాఖల ఉద్యోగులు ఇది గమనించి తమ సమ్మెకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జయ, అన్నపూర్ణ, మేరీ, రిజ్వాన, సునీత, నాగమణి, సిఐటియు నాయకులు జె.బాలరాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి నుండి మండల వ్యాప్తంగా ఉన్న 58 అంగన్వాడి కేంద్రాల తాళాలు పగలగొడుతున్నారు. సోమవారం వీఆర్వోల సమక్షంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది ఈ పనిలో నిమగ్నమయ్యారు. తాళాలు పగలగొట్టిన అంగన్వాడి సెంటర్లను అలానే వదిలేస్తుండడంతో కేంద్రాల్లోని సరుకులు, సామగ్రికి భద్రత ఏమిటనేది ప్రశ్నార్థకమైంది. తాడేపల్లి రూరల్ కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి తదితర గ్రామాల్లోని 12 కేంద్రాల వద్దకు వచ్చిన అధికారులను సిపిఎం, టిడిపి జనసేన పార్టీల నాయకులు ప్రతిఘటించారు. అంగన్వాడీలకు మద్దతుగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు మాట్లాడారు. నాయకులు ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.రామారావు, బి.రమేష్, ఎస్.శ్రీనివాసరావు, కె.మహేశ్వరరావు, డి.అరుణ, ఎం.రాజా, పి.అశోక్, జి.రమేష్‌బాబు, ఎన్.రామారావు, సిహెచ్.సుబ్బారావు, పి.కృష్ణ, బి.సంసోను, కె.సాంబశివరావు, ఎస్కే నాగుల్, జేమ్స్, చందు నాయక్, వి.శ్రీనివాసరావు, ఎం.పాములు, పి.శివనాగేశ్వరరావు, లాల్‌చంద్, కృష్ణ పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్, మహానాడులో 17, 23వ రోడ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టేందుకు సచివాలయ సిబ్బంది రాగా సిపిఎం నాయకలు కొట్టే కరుణాకరరావు, గిరిజ, బాషా, ప్రభాకర్‌రావు, సుధ జయంతి ప్రతిఘటించారు.

దూషిస్తున్న పీడీని బదిలీ చేయాలి

అంగన్వాడీలకు ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలి : సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు విశేష సేవలందిస్తూ ఆన్‌లైన్, రికార్డు వర్క్ తదితర పనులతో వెట్టి చాకిరీ చేస్తున్న అంగన్వాడీలను ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ బి.అరుణ సెంటర్ల తనిఖీల సందర్భంలో అసభ్యకరంగా దూషించడం సరికాదని, ఆమె తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని అంగన్వాడీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఆయన సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు నరసరావుపేట మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. సమ్మె సందర్భంగా అంగన్వాడీలను తాము కలిశామని, ఈ క్రమంలో ఇన్‌ఛార్జి పీడీ దురుసు ప్రవర్తన గురించి పలువురు వివరించి కన్నీటి పర్యంతమయ్యారని తెలిపారు. ఆమెను ఉన్నతాధికారులు బదిలీ చేసి మరొకర్ని నియమించాలని, లేకుంటే పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ కార్యకర్తగా పీడీ వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం నుండి ఆదేశాలేమీ లేకున్నా అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఈపూరు మండలం సిడిపిఒగా పనిచేసిన ఆమెపై అవినీతి ఆరోపణలున్నాయని, వేధింపులకు పాల్పడ్డారనే విమర్శలూ ఉన్నాయని చెప్పారు. ఆమె తీరు ఒక అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి దారితీసిందని గుర్తు చేశారు. తాజాగా ఈపూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మెలో ఉన్న అంగన్వాడీలతో దురుసు వ్యవహరించారన్నారు. జిల్లాస్థాయి అధికారి తన హోదాను మరచి ప్రవర్తించడం సరికాదన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

7వ రోజుకు అంగన్వాడీల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో తాళాలు పగుల గొడుతున్నారని అన్నారు. ప్రభుత్వం నెలల తరబడి సెంటర్లకు అద్దెలు చెల్లించకపోవటం, ఇప్పుడు తాళాలు పగులగొడుతుండటం వల్ల ఆయా భవనాలు యజమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారని, సెంటర్లు ఖాళీ చేయాలని చెబుతున్నారని అన్నారు. తక్షణమే ఈ చర్యను ఆపాలని స్పందనలో జెసి రాజకుమారిని కోరారు. తాళాలు పగులగొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

సమ్మె శిబిరానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నగర కార్యదర్శి టి.రాధ అధ్యక్షత వహించారు. ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, ఎఐయుటియుసి నాయకులు సుధీర్, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బి.సత్యనారాయణ, ఎఐవైఎఫ్ జిల్లా నాయకలు వలి పాల్గొని మద్దతు తెలిపారు. సమ్మె విజయవంతమయ్యే వరకూ అండగా ఉంటామని ప్రకటించారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రజాగాయకుడు పి.వి.రమణ గేయాలు ఆలపించి సంఘీభావం తెలిపారు. మెప్మా ఆర్‌పిల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఆర్‌పిలకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నందున తాము తీసుకోబోమని పీడీకి స్పష్టంగా తెలియజేశామన్నారు. స్కీమ్ వర్కర్లంతా ఐక్యంగా ఉండాలని వారు ఈ సందర్భంగా పిలుపునివ్వటం అంగన్‌వాడీల్లో స్ఫూర్తినింపింది. కార్యక్రమంలో చినవెంకాయమ్మ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు, శ్యామలా, వేదవతి, గోళ్ల మెర్సి, బాజీబి, పద్మ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ధర్నా చౌక్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు అంగన్వాడీలు భారీ ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వీరికి మద్దతుగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్న అంగన్వాడీలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం, కేంద్రాల తాళాలను పగల గొట్టించడం దారుణమని మండిపడ్డారు. లక్షల మంది అంగన్వాడీలు రోడ్డెక్కి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తోందని విమర్శించారు. అధికారులు తాళాలు పగలగొట్టించి పిల్లలను తీసుకెళ్లి ఫొటోలు తీసిన 5 నిమిషాలకే వారిని ఇంటికి పంపుతున్నారని, ఇక వారికి ఆహారం, సంరక్షణ, చదువు తదితర బాధ్యతలు ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న బాలింతలు గర్భిణీలు పిల్లలు సమ్మె వద్దకు వచ్చి అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ తల్లి తర్వాత తల్లి అంగన్వాడి అని, కుటుంబ పోషణ కోసం తల్లులు పనులకు వెళ్తుంటే వారి పిల్లల ఆలనాపాలనను అంగన్వాడీలే చూస్తున్నారని అన్నారు. అందుకే వారికి ప్రజలు, లబ్ధిదార్లు మద్దతుగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. సమ్మె విచ్ఛిన్నం కోసమే మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ అధికారులను ప్రభుత్వం పురిగొల్పుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి సెంటర్లలో వంట పాత్రలు పాడైతే కొత్తవాటిని ఇవ్వడం లేదని, గ్యాస్, కూరగాయల ధరలు పెరిగినా మెనూ ఛార్జీలు పెంచడం లేదని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా బడ్జెట్ కూడా పెంచకుండా కేంద్రాల నిర్వహణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ సమస్యలపై అంగన్వాడీలు పోరాడు తుంటే పరిష్కరించకుండా బెదిరించడం తగని పని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి, నాయకులు సిలార్ మాసూద్, నిర్మల, కవిత, హెల్డా ఫ్లారిన్స్, శోభా రాణి, నరసరావుపేట డివిజన్ పరిధిలోని ఈపూరు, వినుకొండ, నాదెండ్ల, నరసరావుపేట ప్రాజెక్టు అంగన్వాడీలు పాల్గొన్నారు.

పంట నష్టపరిహా(ర)సం

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల్లో పంట నేలవాలింది. వరి పైరు పూర్తిగా పడిపోయినా పరిహారం రాదని చెబుతున్నారు. కంకులు బాగానే ఉన్నాయని నూర్పిడి చేస్తే మంచి దిగుబడి వస్తుందని అంటున్నారు. దీంతో రైతులకు అయోమయం పరిస్థితి ఏర్పడింది. పంట కోత ప్రయోగాల ఆధారంగా వచ్చిన దిగుబడి అంచనాలనే తుపానుకు నేలవాలిన వరికి కూడా వర్తింప చేయడం వల్ల పరిహారం వచ్చేలా లేదు. వరి సాగుకు ఎకరాకు రూ.30 వేలకు పైగా ఖర్చు అయింది. కౌలు రైతులకు మరో రూ.15 నుంచి 20 వేల వరకు అదనంగా ఖర్చు అవుతోంది. తుపాను వల్ల కోతలు, నూర్పిడికి యంత్రాల కొరత వల్ల ఖర్చు మరింత పెరిగింది.

పల్నాడు జిల్లాలో 50 వేల ఎకరాల్లో పంటలకు తుపాను వల్ల నష్టం జరిగిందని అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ తరువాత ఈ నష్టం కేవలం 35 వేల ఎకరాలకు కుదించినట్టు తెలిసింది. గుంటూరు జిల్లాలో వరి పంట 90 శాతం నీట మునగడం, నేలవాలడం జరిగింది. ఇందువల్ల 90 శాతం వివరాలు నమోదు చేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి వత్తిడి వచ్చింది. కానీ అధికారులు నిబంధనల మేరకు నమోదు ప్రక్రియ చేపట్టారు. వాస్తవంగా ఒక్క రోజు అతి భారీ వర్షం కురిసినా పెద్దగా నష్టం లేదని, ఎక్కువ రోజులు వర్షం కురిస్తే అధిక నష్టం జరిగేదని వ్యవసాయ శాఖ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

మరో వైపు మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, చేబ్రోలు, పెదకాకాని, తాడికొండ తదితర ప్రాంతాల్లో అధిక వర్షం వల్ల పత్తి,మిర్చికి ఎక్కువ నష్టం జరిగింది. అయితే పత్తి పంట కేవలం 2500 ఎకరాల్లోనే నష్టం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ప్రధానంగా ఎన్యుమరేషన్ నిర్వహణలో జాప్యం కారణంగా పత్తికి జరిగిన నష్టాన్ని అధికారులు గణించలేకపోయారని వర్షం కురిసిన 10 రోజుల తరువాత వస్తే వారికి ఏం కనబడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాయ, పూత రాలిపోయింది. పత్తి నాణ్యత తగ్గింది. పత్తి నేలవాలింది. అయినా నష్టం నమోదు కాలేదు. ఎన్యుమరేషన్ వివరాలు మదింపు చేస్తున్నామని మంగళవారం ఉదయం కల్లా సచివాలయాల్లో జాబితాలను ప్రచురించాల్సి ఉన్నందున జిల్లా స్థాయిలో గణాంకాల మదింపు ఇంకా పూర్తి కాలేదని అధికారులు సోమవారం రాత్రి తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చే దాక ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం వద్ద సిపిఎం చేపట్టిన రిలేదీక్షలు మూడో రోజుకు చేరాయి. కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు అధ్యక్షత వహించారు. సోమవారం దీక్షలను ప్రారంభించిన కృష్ణయ్య మాట్లాడుతూ రియల్టర్లకు భూములివ్వడాని ల్యాండ్ బ్యాంక్ చట్టాన్ని తెచ్చిన పాలకులకు పేదలుండే ఇళ్లకు పట్టాలివ్వడానికి ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందో అర్థం కావడం లేదని అన్నారు. జగనన్న కాలనీల పేరుతో రూ.కోట్లను ఎమ్మెల్యేలు, మంత్రులు కాజేస్తున్నారని, 20 వేల మందికి సెంటు స్థలం చొప్పున ఇచ్చిన 200 ఎకరాలు, రెండు సెంట్లు ఇస్తే 400 ఎకరాలు కొనాల్సి వస్తుందని, అదే ఉన్నచోట పట్టాలిస్తే రూపాయి ఖర్చు కూడా ఉండదని అన్నారు. ప్రతి పౌరుడికి ఇల్లు, జీవనోపాధి, ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఐక్యరాజ్య సమితి చెబుతోందని, వీటిని ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి పౌరుడికి ఇల్లు కల్పించే విషయంలో మనదేశం ప్రపంచంలో 112 స్థానంలో ఉందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు మాట్లాడుతూ తమది పేదల ప్రభుత్వమని సిఎం జగన్ గొప్పలు చెప్పుకోవడమే గాని, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కాజా, ఆత్మకూరు, ఇంకా వివిధ గ్రామాల్లో అనేక రకాల భూముల్లో ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వడం లేదని అన్నారు. పట్టాలు ఇచ్చేంతవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దీక్షలకు మద్దతుగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఎం.పకీరయ్య, యు.దుర్గారావు, వి.వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు, సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజీ తదితరులు మాట్లాడారు. దీక్షలో ఎం.రవి, కె.ప్రకాష్‌రావు, వి.వెంకటేశ్వరరావు, యు.దుర్గారావు, సిహెచ్ సీతారామాంజనేయులు, సిహెచ్ గిరిధర్‌రావు, జి.నాగేశ్వరరావు, కె.సురేష్, ఎం.శ్రీను, జి.లక్ష్మి, కె.సుజాత, టి.శకుంతల, జి.నాగేశ్వరరావు, ఎస్.రాధా, కె.శివమ్మ, సిహెచ్ దుర్గ, జి.హైమావతి, జి.లీలావతి, ఎ.తనుజ, పి.వెంకటలక్ష్మి, కె.మంగమ్మ, వి.ప్రశాంతి, డి.ఉమా మహేశ్వరి, జి.మాధవరెడ్డి, ఎం.శివయ్య, పి.అప్పారావు, ఎం.అరుణ, ఎ.విజయలక్ష్మి, బి.సత్యమారెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, వీర్లంకయ్య, ఎస్.వెంకటనారాయణ కూర్చున్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, జిల్లా నాయకులు బి.కోటేశ్వరి, పట్టణ నాయకులు ఎం.బాలాజీ పాల్గొన్నారు.

దీక్షా పరులకు ఎర్రదండలేస్తున్న సిపిఎం జిల్లా నాయకులు బి.కోటేశ్వరి

విద్యుత్ ఆదాలో భాగస్వామ్యం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుచ్ఛక్తి ఆదాను ప్రతి ఒక్కరూ పాటించి భావితారాలకు ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత వుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుండి జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా డిసెంబర్ 14వ తేదీ నుండి 20వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సంస్థ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఇంధన వనరులు పరిమితంగా ఉన్నాయని, అయితే జనాభా పెరుగుదల వల్ల విద్యుచ్ఛక్తి అవసరాలు పెరుగుతున్నాయన్నారు. ఉన్న వనరులను జాగ్రత్తగా వాడుకొని భావితరాలకు అందించాల్సి ఉంటుందన్నారు. తక్కువ విద్యుచ్ఛక్తితో నడిచే అత్యాధునిక ఫ్రిడ్జ్ , టీవీ, ఏసీలు ప్రజలు వాడే విధంగా అవగాహన కలిగించాలన్నారు. సాధారణ బల్బుల స్థానంలో ఎల్ఈడి బల్బుల వాడకం వల్ల 30 శాతం విద్యుచ్ఛక్తి ఆదా అవుతుందన్నారు. అవసరం అయిన సందర్భంలో తప్ప మిగిలిన సందర్భాలలో విద్యుత్ వినియోగం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుచ్ఛక్తి ఆదాలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా విద్యుచ్ఛక్తి ఆదాపై ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు సర్కిల్ ట్రాన్స్‌కో పర్యవేక్షక ఇంజనీర్ మురళీకష్ణయాదవ్, సీఆర్డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

రేపు మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.అబ్దుల్ సలీమ్ కోరారు.సోమవారం బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జిల్లా సెక్రెటరీ సలీమ్ మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయ్ చట్టం-1976లో వచ్చినప్పటికీ వాటిని మందుల కంపెనీల యాజమాన్యాలు అమలు చేయట్లేదన్నారు. ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం చూడాలని, మెడికల్ రిప్రెసెంటేటివ్‌లకు ఖచ్చితమైన పని పద్ధతులు కల్పించి చట్టబద్ధం చేయాలని కోరారు. మందుల ధరలు తగ్గించడానికి ప్రభుత్వం ఎన్నుకున్న విధానం మందుల కంపెనీల యాజమాన్యాలకు లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. ఉత్పత్తి ధరపై నిర్ణీత లాభం ఉండేలా చూసి ప్రభుత్వమే ధరలను నిర్ణయించినపుడే ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. మందులు, వైద్య పరికరాలపై జిఎస్టిని పూర్తిగా ఎత్తివేయాలని, జిడిపిలో కనీసం ఐదు శాతం వైద్య రంగానికి కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఫణింద్ర మాట్లాడుతూ సేల్స్‌కి మెడికల్ రిప్రజెంటేటివ్‌ను బాధ్యుడిని చేస్తూ యాజమాన్యాలు చేస్తున్నటువంటి దాడుల వల్ల అనేక చోట్ల మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కోవిడ్ తర్వాత వచ్చిన మార్పులను యాజమాన్యాలు తమకు అనుకూలంగా మార్చుకుని పని ఒత్తిడి పెంచారన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌ల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగేలా జిపిఎస్, జిపిఆర్ఎస్ రుద్దడటం మానుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.అనిల్ కుమార్, వి.శశిధర్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జునరావు, కోశాధికారి ఎన్.సీతారాంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సుబ్బారావు, ఎం.హనుమంత్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

డొంకరోడ్డును బాగుచేయాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి :ఉండవల్లి దళితవాడ కరకట్ట నుండి నులకపేట మాత ఆశ్రమం వరకు డొంక రోడ్డుకు రెండు వైపులా ముళ్ళ కంప పెరగటం వలన రైతులు తమ పంట పొలాల్లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డొంక రోడ్డు ముళ్ళకంపను తొలగించి ధాన్యం తీసుకెళ్లడానికి మార్గాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉండవల్లిలోని రైతు భరోసా కేంద్రం సిబ్బందికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన ముళ్లకప్పుడు తొలగించడం లేదన్నారు. కావున తక్షణమే ముళ్ళ కంపను తొలగించి రైతులను ఆదుకోవాలని కోరారు. వినతపత్రం ఇచ్చినవారిలో రైతు సంఘం ఉండవల్లి ఉపాధ్యక్షులు పి. వీరాస్వామి, రైతులు భక్తిరెడ్డి జె.నాగిరెడ్డి, బి.పోతురాజురెడ్డి, ఇస్సాకు, బాలయేసు మాణిక్యా లరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

లోపలికి తోసుకువెళ్లిన యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నిరుద్యోగ లోకాన్ని వంచించిన వైసిపి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలయిందని ఒకసారి అధికారం అప్పజెప్తేనే నిరుద్యోగ రేటులో రాష్ట్రాన్ని ప్రథమ స్థానానికి తీసుకెళ్లి పాలన పక్క పెట్టి రాజకీయ వ్యాపారం చేసుకుంటున్నారని జిల్లా యువజన విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి మండి పడింది. రాష్ట్రంలో ఖాళీ పోస్టులో భర్తీ చెయ్యాలని గ్రూప్ 1,2 అభ్యర్థుల వయోపరిమితి పెంచాలన్న డిమాండ్ తో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చేందుకు నిరుద్యోగ ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో వెళ్లిన యువజన విద్యార్థి సంఘాల నాయకులను లోపలకి పంపకుండా నగరంపాలెం ఎస్ఐ సురేష్ రెచ్చగొట్టే మాటలతో దురుసుగా ప్రవర్తించారని నాయకులు ఆరోపించారు. ఎంతసేపటికి పంపకపోవటంతో గ్రీవెన్స్ హాల్ గేట్ ముందు యువజన విద్యార్థి సంఘాల ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి ఎంతసేపటికి పంపకపోవటంతో ఒక్కసారిగా ప్రధాన ద్వారం నుండి కార్యాలయంలోకి దూసుకెళ్లి గ్రీన్వెన్స్ హాల్ కు చేరి జె సి రాజకుమారి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చేసిన నోటిఫికేషన్ల జాప్యం వలన 50,000 మందికి పైగా వయోపరిమితి కోల్పోయారని తెలిపారు. గ్రూప్ 1,2 అభ్యర్థుల వయోపరిమితిని 42 నుండి 44 ఏళ్ళకి పెంచాలని దేశంలోనే అత్యధికంగా 24 శాతం మంది పట్టభద్రుల నిరుద్యోగులు మన రాష్ట్రంలో ఉంన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వలి, బందెల నాసర్జీ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కట్టా జవహర్ నాయుడు, ఎన్ఎస్‌యు ఐ జిల్లా నాయకులు కరీం తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో నిషేధించబడిన సిగరెట్స్ విజిలెన్సు అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో పిడుగురాళ్ల లోని లలిత్ బాబు జనరల్ స్టోర్‌లో తనిఖీ చేశారు. షాపులో నాన్ డ్యూటీ పెయిడ్ గూడ్స్ సిగరెట్లను అమ్ముతున్నట్లు గుర్తించారు. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వీటి విలువ రూ.1.06లక్షలని విజిలెన్సు అధికారులు తెలిపారు. సిగరెట్లను సరఫరా చేసిన డి.రమేష్ పై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్, సిఎస్‌సి ప్రతినిధులు

విజ్ఞాన్‌తో సిఎస్‌సి అకాడమీ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ భారత ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగంతో నిర్వహించబడుతున్న విశాఖపట్నంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) అకాడమీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. సోమవారం సీఎస్‌సీ అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్‌మోహన్‌తో వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన 8000 విద్యార్థులతో పాటు అధ్యాపకులకూ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వేగంగా అభివద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీపై ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సి-డాక్, ఐఈఈఈ సంస్థల ద్వారా సర్టిఫికెట్‌లను అందిస్తామన్నారు. రామ్ మోహన్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఇండస్ట్రీ గానీ, వత్తితో సంబంధం లేకుండా డిజిటల్ ప్రపంచంలో వస్తున్న సాంకేతికతను స్వీకరించాలన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

జిఎంసి స్పందనకు 31 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు :ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాదిపతే స్వయంగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్పందన నిర్వహించారు. ప్రజల నుండి 31 అర్జీలు స్వీకరించగా వాటిల్లో పట్టణ ప్రణాళిక విభాగం 20, ఇంజినీరింగ్ విభాగం 4, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 1, ఉపా సెల్ విభాగం సంబంధించి 3 ఫిర్యాదులు అందాఇయ. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ, ఉపాసెల్ సూపర్నెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు.

అష్ఫఖుల్లా ఖాన్, రాంప్రసాద్, బిస్మిల్లా పోరాటం చిరస్మరణీయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అష్ఫఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్లా అమరులయ్యారని విరసం సీనియర్ నాయకులు సీఎస్ అర్.ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సోమవారం స్థానిక అంబేదర్ భవన్‌లో అష్ఫఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్లా సంస్మరణ 96వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడిఎం జిల్లా కన్వీనర్ డి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భగా సిఎస్ ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అశువులు బాసిన అమరుల ఆశయ సాధనలో ప్రజలంతా ఐక్యంగా పోరాడి వారి స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. పిడిఎం నాయకులు వైవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని బహుళ జాతి కంపెనీలకు అప్పగిస్తూ ప్రజలపై నిరంతరం దోపిడీ కొనసాగిస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కవి బి.విల్సన్ , విసికే రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ, భీం సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ షేక్ అప్సర్ బాబు, భారత్ బచావో జిల్లా కార్యదర్శి, న్యాయవాది సమత , దళిత, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంటా ప్రభుదాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఎస్ఆర్ ప్రసాద్

బహిరంగ ప్రకటన

ప్రధాన మంత్రివర్యుల కార్యాలయము నుండి జస్టిస్ నిమిత్తము రాబడిన కంప్లయింట్స్‌కు అనుగుణముగా తత్సంబంధిత ప్రదేశము మరియు అందలి అంశాలకు అనుగుణముగా విచారణ ఖర్చులను అనగా కమీషనర్ వారి నియామకానికి అనుగుణముగా వారి ఫీజు, ఖర్చులు చెల్లించుటకు పిర్యాది సిద్ధపడి ఫిర్యాదిని మరియు ప్రతివాదులను తరిగొండ సత్య న్యాయ పీఠికపై విచారణార్థము విజయవాడ ఎ.సి.బి.కోర్టు పరిధిని తరిగొండ సత్య పీఠికపై వరకు పెంచి విచారణ ఆదేశాలు జారీకి, అమలు నిమిత్తము ఎ.పి. హైకోర్టు యంత్రాగాన్ని అభ్యర్థించిననూ స్పందన లేనందున మరియొక పర్యాయము బహిరంగంగా విన్నవించడమైనది/అభ్యర్థించడమైనది.

పి.వెంకటేశ్వరరావు, గుంటూరు
సెల్ నెం.9849933404.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE AT AVANIGADDA
H.M.O.P.No.85/2023

Between:-
గుంటూరు చిన్నారి ...పిటీషనర్
And
గుంటూరు వీరబాబు, S/o ఫిరోజ్, హిందు, 42 సం॥, వ్యాపారం, గుండవరం గ్రామం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా. ...రెస్పాండెంటు

పై నంబరు పిటీషన్ లో పిటీషనర్ రెస్పాండెంటు పై విడాకులు కోరుతూ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి, అవనిగడ్డ వారి ఎదుట పిటిషన్ దాఖలు చేసి యున్నారు. సదరు H.M.O.P.No.85/2023 లో రెస్పాండెంటు కు నోటీసు నిమిత్తం ది.28-12-2023న వాయిదా అయిఉన్నది. కావున రెస్పాండెంటుకు పిటీషన్‌లో ఏవిధమైన ఆక్షేపణలు ఉన్ననూ ది.28-12-2023 న ఉదయం 10-30 గం॥లకు శ్రీ పై కోర్టువారి ఎదుట హాజరై తెలియజేసు కోగలరు. లేని యెడల పరోక్షంగా తీర్మానింతురు.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

అవనిగడ్డ,
18-12-2023

నరహరిశెట్టి ఈశ్వరరావు,M.A,B.Com,B.L
న్యాయవాది,
అవనిగడ్డ-521121,
9848096220

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.పి. నెం. 11/2018

బిట్వీన్ :
కల్లూరి వెంకట రామాంజనేయులు .... పిటీషనర్
మరియు
మందడి నరసింహారావు మరియు 31 వగైరాలు .... రెస్పాండెంట్లు

టు
రెస్పాండెంట్ నెం.2 : బద్దుల సుధాకర్, తండ్రి సాంబయ్య, వయస్సు 42 సం॥, నివాసం ధూళిపాళ్ళ గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడుజిల్లా.
రెస్పాండెంటు నెం.18 : దరువూరి రామారావు, తండ్రి : తెలియదు, వయస్సు 50 సం॥లు, నివాసం : నాగార్జుననగర్, సత్తెనపల్లి పట్టణం మరియు మండలం, పల్నాడుజిల్లా.
రెస్పాండెంటు నెం.22 : నూతక్కి తిరుపతిరావు తండ్రి : తెలియదు, వయస్సు 45 సం॥లు, నివాసం : రావెల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌లో ఇందలి 2, 18, 22 నెంబర్లు గల రెస్పాండెంట్లు అయిన మీ వగైరాలపై పై కోర్టులో ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేయగా కోర్టువారి ఉత్తర్వుల ప్రకరం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. పై పిటీషన్లఓ మీ హాజరు నిమిత్తం ది. 24-01-2024న వాయిదా అయివున్నది. వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున ఇన్‌సాల్వెన్సీ పిటీషనర్‌ను విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టువారి అనుమతితో)

వాయిదా : 24-1-2024

సిహెచ్.ప్రవీణ్‌కుమార్,
పిటీషనర్ తరఫు న్యాయవాది,
సత్తెనపల్లి. **గుంటూరు.**
తేది:18-12-2023 **సెల్ : 8125255255**

మహారాజ శ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో
I.A.No.41/2022 in O.S.No.73/2019

Between:
కామిశెట్టి అప్పారావు ...వాది
మరియు
1.గుదే పున్నమ్మ (డైడ్) మరియు ఇతరులు ...ప్రతివాదులు

To:
R4/D4: సుంకర నాగమణి, D/o లేట్ నాగార్జున,
R5/D5: గుదే నరేంద్ర, S/o లేట్ నాగార్జున,
బోత్ ఆర్ R/o చెరువు కట్ట బజార్, పిడుగురాళ్ళ గ్రామం మరియు మండలం, పల్నాడు జిల్లా.

పై కోర్ట్‌లో వాది మీపై పిటిషన్ దాఖలు చేసి మీకు నోటీసులు ఎన్నిసార్లు పంపినను మీకు ముట్టనందున శ్రీ కోర్ట్ వారు నోటీసులు నిమిత్తం ది.22-12-2023 వ తేదీన వాయిదా రోజు ఉదయం గం.10-30 ల.కు పై కోర్ట్ వారి ఎదుట హాజరై మీకు ఆరోపణలు ఉన్న ఎడల తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందున తీర్మానించగలరు.

వాయిదా తేది:22-12-2023

డి.అనంత రామయ్య,
కే.నాగలక్ష్మి,
గురజాల న్యాయవాదులు,
వాది తరపు న్యాయవాదులు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంబాబు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అవసరాన్ని బట్టి నిధులు

సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతులకు నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని కొమెరపూడిలో రూ.3 కోట్లతో ర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీ సిపిడి సిఎల్‌సి ఎమ్‌డి పద్మజనార్ధన్‌రెడ్డితో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం బిపిసిఎల్ యాజమాన్యం అందించిన సిఎస్ఆర్ నిధులు రూ.45 లక్షలతో ఎస్సీ కాలనీలో సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పారదర్శక సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులనూ తమ ప్రభుత్వం చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అవసరతను బట్టి నిధులు సమకూర్చుతున్నామని అన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించగా విద్యుత్ ఎస్ఇ మురళీ కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, ఎంపిపి షేక్ జై బూన్ బి, జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరమ్మ, వైసిపి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు పెదమక్కెన విద్యార్థి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జాతీయ స్థాయి హాకీ పోటీలకు మండలంలోని పెదమక్కెన జెడ్‌పి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మట్టుపల్లి రిషి ఎంపికైనట్లు పిఇటి బి.అనిల్ దత్తా నాయక్ సోమవారం తెలిపారు. ఈనెల 13-16 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన రిషి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జనవరి 6-11 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు రిషి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. రిషిని హెచ్ఎం కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

బెజగం రవికుమార్‌కు కళారత్న పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పురస్కారాన్ని అందుకుంటున్న బెజగం రవికుమార్

పట్టణానికి చెందిన నటుడు బెజగం రవికుమార్ ఎస్‌వి రంగారావు జాతీయ కళారత్న పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని కెఆర్ ఫౌండేషన్, లిటిల్ ఛాంప్స్ అకాడమీ అఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద శెట్టి బలిజ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కళలు, కవిత్వం, సమాజ సేవా, వైద్యం, భరత నాట్యంలో బాల బాలికలకు ఎస్‌వి రంగారావు, చంద్రమోహన్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పురస్కారాలను గత ఆదివారం ప్రదానం చేశారు. ఈ క్రమంలో పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు కళల విభాగంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ అధినేత కె.బుచ్చేశ్వరరావు, విజయలక్ష్మి, డాక్టర్ శైలజ, జోగి మంజుల, రామచందర్ తదితరులు పాల్గొన్నారు. రవికుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఇంటి కోసం, సెంటర్ కోసం అప్పులతో తిప్పలు

- తీవ్ర పని ఒత్తిడితోపాటు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాం
- సత్తెనపల్లి, గురజాలలో అంగన్వాడీల భారీ ర్యాలీలు
- ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా - వినతులు

సత్తెనపల్లి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, నాయకులు

గురజాలలో ఆర్‌డిఒ కార్యాలయానికి నిరసన ప్రదర్శనగా వెళ్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్, దాచేపల్లి

సెంటర్ల నిర్వహణకు, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితిలో ఉన్నామని, తీవ్ర పనిఒత్తిడితోపాటు ఆర్థిక అవస్థలనూ నిత్యం అనుభవిస్తున్నామని అంగన్వాడీలు ఆవేదన వెలిబుచ్చారు. వారం రోజుల నుండి చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం సత్తెనపల్లి, గురజాలలో భారీ ప్రదర్శనలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి తమ ఆవేదనలను వివరించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి కార్యదర్శి జి.మల్లీశ్వరి మాట్లాడుతూ తెలంగాణలో కంటే అధికంగా ఆంధ్రలోని అంగన్వాడీలకు జీతాలు ఇస్తామని ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలప్పుడు హామీనిచ్చారని, ఇప్పటికీ ఆ మాట ఉత్త మాటగానే మిగిలిందని ఆవేదన వెలిబుచ్చారు. మాట తప్పను.. మడమ తిప్పను అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఎదురు డబ్బులు పెట్టాల్సి వస్తోందని, 2017 నుండి టిఎ బిల్లులు రాలేదని తెలిపారు. చిత్తశుద్ధిలేని చర్చలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చటానికి ప్రభుత్వం వద్ద నిధుల్లేవంటూ మంత్రులు చెబుతున్నారని, మరోవైపు ఎన్నికల హామీలు నూరు శాతం నెరవేర్చామంటూ ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. అంగన్వాడీలకు అత్తెసరు జీతాలిస్తూనే సంక్షేమ పథకాల్లో కోత పెట్టారని, భద్రత లేని ఉద్యోగాలు, చాలీచాలని జీతాలతో జీవన పోరాటం చేస్తున్న అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. లేకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మహేష్, ఆర్.పురుషోత్తం, జె.రాజ్‌కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజిని, నాయకులు జి.ఉమశ్రీ, డి.విమల, యూనియన్ నాయకులు జి.శివపార్వతి, జయలక్ష్మి, ధనలక్ష్మి, చాముండేశ్వరి, అంజలి, శివనాగమల్లేశ్వరి, భవాని, రహీమున్నిసా, విజయకుమారి, లీలావతి, శ్రీలక్ష్మి ఉన్నారు.

గురజాల ధర్నా చేసి ఆర్‌డిఒ రమాకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అంగన్వాడీలకు మద్దతుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏవూరి గోపాలరావు మాట్లాడుతూ అంగన్వాడీలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి వారి డిమాండ్లను అంగీకరించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం చీమ కుట్టినట్లుగా కూడా స్పందించడం లేదని, ఇదే తీరు కొనసాగితే సిఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడదిస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. యూనియన్ నాయకులు ఉష, మహాలక్ష్మి, మల్లీశ్వరి, సైదమ్మా, శివకుమారి, రుక్మిణి, దేవకుమారి, రత్నం, నాగకుమారి, ప్రమీల, మల్లేశ్వరి, జ్యోతి, సుమతి, షేక్ హాజ్రా, డి.శాంతామణి, బుజ్జి, వెంకటరమణ, కవిత, పద్మ, అరుణ, రాధికా పాల్గొన్నారు.

తాళాలు పగలగొట్టాలనే ఆదేశాల్లేవు : ఆర్‌డిఒ

సత్తెనపల్లి ఆర్‌డిఒ రాజకుమారికి వినతిపత్రం ఇచ్చిన సందర్భంలో ఆమె స్పందిస్తూ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీలను కోరారు. దీనికి ప్రతిస్పందనగా అంగన్వాడీలు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించని ప్రభుత్వం తాళాలు పగలగొట్టించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఆర్‌డిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలేమీ ఇవ్వలేదని, ఆ చర్యలు సమర్థనీయం కాదని అన్నారు.

ఇళ్లను ఎమ్మెల్యే కూల్చేయిస్తున్నారు..

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న క్రిస్టియన్‌పాలెం వాసులు

తమ ఇళ్లను ఎమ్మెల్యే కూల్చేయించి ఆ స్థలాలను ఆక్రమిస్తున్నారని పట్టణంలోని క్రిస్టియన్‌పాలెం వాసులు వాపోయారు. ఈ మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఆర్‌డిఒ శేషిరెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత మహిళల మాట్లాడుతూ ఓట్లేసి ఎమ్మెల్యేను గెలిపించుకుంటే ఆయనే తమ ఇల్లను జెసిబిలతో పడేసి చదును చేస్తున్నారని, ఎమ్మెల్యే అనుచరులు అక్కడే టెంట్లు వేసుకుని మద్యం తాగుతూ అటుగా ఎవరైనా వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని చెప్పారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. అరవింద్‌బాబు మాట్లాడుతూ పట్టణంలోని 4, 5వ వార్డులోని క్రిస్టియన్‌పాలెం, పలు ప్రాంతాల్లో పేదలు దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే ఎమ్మెల్యే అనుచరులు వాటిని కూల్చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పట్టాలున్నా లెక్కజేయడం లేదని, క్రిస్టియన్‌పాలెం సమీపంలో పేదలు గుడిసెలు వేసుకున్న 22 సెంట్లతో పాటుగా పక్కనే ఉన్న నాలుగున్నర ఎకరాలనూ ఆక్రమించుకుంటున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని, వాటిని ఎకరా రూ.5 కోట్ల చొప్పున అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.సింహాద్రి యాదవ్, ఎం.రామారావు, కె.వెంకటేశ్వర్లు, రమేష్, బాష, జాకీర్ పాల్గొన్నారు.

కెసిపి ఆవరణలో లక్ష్మణదత్తు విగ్రహావిష్కరణ

20 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 70 మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

లక్ష్మణదత్తు విగ్రహం ఎదుట కెసిపి యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సంస్థలను ఆధునీకరించి అభివృద్ధి పథంలో నడిపిన లెజెండ్ లీడర్ వెలగపూడి లక్ష్మణ దత్తు అని కెసిపి సంస్థల చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెలగపూడి ఇందిరా దత్తు అన్నారు. స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ ఆఫీస్ ఆవరణలో కెసిపి సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణ దత్తు విగ్రహాన్ని ఇందిరా దత్తు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెసిపి సంస్థల్లో ఉద్యోగులందరూ సంస్థ తమది అనుకొని అంకితభావంతో పనిచేయడం వల్ల సంస్థ అభివృద్ధి పథాన నడుస్తోందని చెప్పారు. లక్ష్మణ దత్తు జ్ఞాపకార్థం కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో 20 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 70 మంది కార్మికులు, ఉద్యోగులకు ఒక్కొక్కరికి 146 చదరపు గజాల ఇంటి స్థలాలను ఉచితంగా అందజేశారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ పట్టాలను కార్మికులకు ఇందిరా దత్తు ఇచ్చారు. లక్ష్మణ దత్తు కుమార్తె కెసిపి సంస్థల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కవిత దత్తు మాట్లాడుతూ కెసిపి సంస్థల్లో యాజమాన్యం - కార్మికుల మధ్య సంబంధాలకు పెద్దపీట వేశారని, వారి పేరు మీదుగా కార్మికులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. లక్ష్మణ దత్తు అల్లుడు కెసిపి సంస్థల డైరెక్టర్ చిట్టూరి రవికుమార్ మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాలు చూస్తుంటే దత్తు మీద ఉన్న ప్రేమాభిమానాలు కనపడుతున్నాయని, వారి మీదున్న ప్రేమకు గుర్తుగా ఇళ్ల స్థలాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సీనియర్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ దత్తు అందించిన మార్గంలో నడవటం మనం ఆయనకిచ్చే నివాళి అని చెప్పారు. ఒక్కొక్క కార్మికునికి రూ.15 లక్షల ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఉచితంగా ఇవ్వడం హర్షణీయమని కొనియాడారు.

తాళాలు పగలగొట్టి ఉద్యమాన్ని ఆపలేరు

సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

పలుచోట్ల అంగన్వాడీల నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి - మంగళగిరి

అంగన్వాడి కేంద్రాల ప్రభుత్వం చట్ట విరుద్ధంగా తాళాలు పగలగొడితే సమస్యలు పరిష్కారం కావాలని, న్యాయమైన అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గుంటూరు సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అన్నారు. అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో గత వారం రోజుల నుండి నిరవధిక సమ్మె జరుగుతుంది. అంగన్వాడీల కేంద్రాల తాళాల పగలగొట్టడాన్ని నిరసిస్తూ సోమవారం మంగళగిరి పట్టణంలో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనం తరం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాల యం వద్ద రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ వి నిర్మలా కుమార్ వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి తాళాలు పగలగొట్టకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్వాడీల తాళాలు పగలు కొట్టడాన్ని చూస్తుంటే రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగు తున్నట్లుగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇస్తానని హామీలు ఇవ్వడంతో ఆ హామీని నెరవేర్చమని గత నాలుగున్నర సంవత్సరాలుగా అంగన్వాడీలు అనేక రూపాల్లో ఆందోళనలు చేసి వినతి పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నా రని అన్నారు. అలాంటిది తాళాలు పగలగొట్టి సచివాలయ ఉద్యోగులకి బాధ్యతలు అప్పగిస్తే వాళ్ళు చిన్న పిల్లలకు సేవ చేయగలుగుతారని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం భాగ్యరాజ్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించ కుండా చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని విమర్శించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు టి జయశ్రీ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల తాళాలు పగలగొడతాం అంగన్వాడీల ఆత్మాభిమానంపై దెబ్బ కొట్టడమే అన్నారు. నాయకురాలు హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిఐటియు, ప్రజా సంఘాల అండతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్ గణేష్, టిడిపి నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర: కొల్లిపరలో అంగన్వాడీ సమ్మె కు ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ కె బెనర్‌బాబు మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి - తాడికొండ :తాడికొండలో సమ్మె శిబిరం నుండి అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఫణీంద్ర బాబుకు వినతి పత్రం అందించారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కే జగన్, అంగన్వాడీ వర్కర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు :పెదనందిపాడులో సమ్మె శిబిరానికి టిడిపి నాయకులు బి రామాంజనేయులు, అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు, సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు తదితరుల మాద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి - కాకుమాను : కాకుమాను సమ్మె శిబిరాన్ని టిడిపి ప్రతిపాడు ఇంచార్జ్ బి రామాంజనేయులు సందర్శించి మద్దతు తెలియజేశారు, సిఐటియు నాయకులు కందుల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, ఎన్ రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్:పెదకాకాని సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ సందర్శించి మద్దతు తెలిపి ప్రసంగించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో నిరవధిక సమ్మెకు దిగవలసి వచ్చిందని అన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందగా అంగన్వాడీలు మోకాళ్లమీద నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీ టీచర్లు , ఆయాలు రాజధాని ప్రాంతం తుళ్లూరులో బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న సమ్మె శిబిరం నుండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రాల తాళాలు పగలగొట్టవద్దని, ప్రభుత్వం సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని కార్యదర్శి ఎం భాగ్యరాజ్, యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి రూరల్ : స్థానిక ఎఎస్ఎన్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సిఐటియు తన పూర్తి మద్దతు తెలిపింది. సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మార్వో, సబ్ కార్యాలయాలను చుట్టుముట్టారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. తొలుత తెనాలి ఎమ్మార్వో రవిబాబుకు వినతిపత్రాన్ని సమర్పించి అనంతరం ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ కు వినతిపత్రాన్ని అందించారు. సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతి పత్రం స్వీకరించిన సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ కు తమ సమస్యలను వివరిస్తామని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హుస్సేన్ వలి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎవిఎన్ కుమారి, పి పావని, విజయలక్ష్మి, ఎలిజబెత్, హైమావతి, రంగపుష్ప, చంద్రకళ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం :ఫిరంగిపురంలో అంగన్వాడీల సమ్మెకు టిడిపి నాయకులు మండవ చిన నరసింహారావు, వేములూరిపాడు మాజీ సర్పంచ్ రాము, సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు: చేబ్రోలు సమ్మె శిబిరంలో యూనియన్ మండల కోశాధికారి సుమలత, సిఐటియు నాయకులు హనుమంతరావు మాట్లాడుతు సమస్య పరిష్కరించే వరకు పోరాడతామని తెలిపారు.

ప్రజాశక్తి - మేడికొండూరు :మేడికొండూరులో సమ్మె శిబిరానికి టిడిపి జిల్లా అంగన్వాడీ అధ్యక్షులు జానీబేగం, టిడిపి మండల అధ్యక్షుడు నార్నె శ్రీనివాసరావు జనసేన జిల్లా అధికారి ప్రతినిధి జ్యోతి , కన్వీనర్ రాచర్ల నాగబాబు, మాజీ జెడ్పీ చైర్మన్ జి సాంబశివరావు, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు మద్దతు తెలిపి ప్రసంగిచారు.

పొన్నూరు రూరల్: పొన్నూరులో సమ్మె శిబిరంలో సిఐటియు నాయకులు నిమ్మకూరు రమేష్‌బాబు, యూనియన్ అధ్యక్షులు ఎస్‌వి సుకన్య ప్రసంగించారు.

పెదకాకానిలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న వై.నేతాజీ, అంగన్వాడీలు

మంగళగిరి ధర్నాలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

తుళ్లూరులో ర్యాలీ

తెనాలిలో వినతి

చేబ్రోలులో

కొల్లిపరలో

మేడికొండూరులో

పొన్నూరులో

తాడికొండలో

పెదనందిపాడులో

రేపు గుంటూరులో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - గుంటూరు :డిసెంబర్ 20వ తేదీన గుంటూరు నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ సోమవారం తెలిపారు. విద్యా రంగంలో వస్తున్న మార్పుల పైన ఉద్యమాలు నిర్మించేందుకు ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా మహాసభలో కార్యాచరణ నిర్ణయిస్తామ న్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో పెను మార్పులు తీసుకొస్తున్నా యన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ లో అమలు చేయడం 4 సంవత్సరాలు డిగ్రీ మరియు విద్యా దీవెన,వసతి దీవెన అవకతవకలు అమ్మబడిలో కోతలు జీవో నెంబర్ 77 పేరుతో పేద విద్యార్థులకు పీజీ చదువుల దూరం చేయటం ఇలా విద్యారంగంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న కాలంలో ఈ మహాసభలు గుంటూరు నగరం పాత గుంటూరు సిఐటియు ఆఫీసులో లో జరుగుతున్నాయి.

మాట్లాడుతున్న బి లక్ష్మణరావు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సంస్థ ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలని, గత ఐదేళ్ల నుండి పెండింగ్లో ఉన్న పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని, కొత్త షిఫ్ట్ ఆపరేటర్లకు పాత ఆపరేటర్ లాగే జీతం ఇవ్వాలని, వాచ్మెన్లను ఫీల్డ్‌కు వాడకూడదని డిమాండ్లతో స్థానిక పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆవుల మురళీకష్ణ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పవన్, జి.నాగరాజు, కోశాధికారి కె. రాంబాబులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలో ప్రకారం కాంట్రాక్టర్ ప్రమేయం లేకుండా ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. తెలంగాణలో విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులకు రూ.43 వేలు ఇస్తుంటే ఇక్కడ మాత్రం పెంచిన జీతంతో కలిపి రూ.26వేలు, కొంతమందికి రూ.20వేలు మాత్రమే వస్తున్నాయన్నారు. కొత్త షిఫ్ట్ ఆపరేటర్లు పాత షిఫ్ట్ ఆపరేటర్లు మధ్య జీతాలు వ్యత్యాసం లేకుండా ఒకే జీతం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు వర్మ, అశోక్, నాగవంశీ, భాష, కిషోర్, రవి, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్, కరస్పాండెంట్ ఈశ్వర్

మార్త గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్స్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి :స్థానిక సుల్తానాబాద్‌లోని మార్త గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్స్‌లో సెమి క్రిస్మస్ వేడకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ యనమల ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బిషప్ కత్తెర సుధీర్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని చ్చారు. ఈ సందర్భ:గా ఎమ్మెల్యే మాట్లా డుతూ క్రైస్తవుల ఐక్యతకు, ప్రేమతత్వానికి చిహ్నంగా సెమి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవటం అభినందనీ యమన్నారు. విద్యాసంస్థల ద్వారా పేద వర్గాల్లో విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న సంస్థ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దుబాబ్‌బాబు, యాతాటి అనిల్, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, నళిని, పెరికల గిద్యోను, కమలాకర్, ప్రకాష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, దైవసేవకులు శామ్యుల్, రాజేష్. హనుమ, రవి, చంద్రకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మలినేనిలో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పుల్లడిగుంటలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కాలేజిలో మొదటి రోజు విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ సాఫ్ట్‌వేర్ అండ్ ఇట్స్ యాంటీ వైరస్ ప్రోగ్రామ్‌ని ఇంటిలిజెన్స్ డిఎస్‌పి జి.లక్ష్మయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజి చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుధాకర్‌రావు, హెచ్‌ఒడి జి.రాజేష్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మయ్య

ఏపిపిఎస్సీ గ్రూప్ -1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎస్సీ,ఎస్టీ. బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎపిపిఎస్సీ గ్రూప్ -1,గ్రూప్ -2 ప్రిలిమినరీ పరీక్షలకు రిక్రూట్మెంట్ ప్రిలిమినరీ ఉచిత శిక్షణలకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన వెనుకబడిన తరగతులు బీసీ ఎస్సీ , షెడ్యూల్ తెగలు ఎస్టి అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ గుంటూరు జిల్లా వారికి దరఖాస్తులు పం పాలని పల్నాడు జిల్లా బీసీ వెల్ఫేర్, సాధికారత అధికారి బి.శివ నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు.గ్రూప్- 2 కు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 100 మంది అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ నుండి 50 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తారని పేర్కొన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, 60 మంది అభ్యర్థులకు వచ్చే ఏడాది జనవరి 5 నుండి 60 రోజులపాటు ఉచిత శిక్షణ మెటీరియల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి,ఇంటర్, డిగ్రీ మార్కులు లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్ష లోపు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. ఆధార్,బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు జతపరిచి గ్రూప్-1గ్రూప్-2 కు సిద్ధం అవుతున్న అభ్యర్థులు ఆయా తేదీల్లోగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అభ్యర్థులు రాజాగారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్ గుంటూరు కార్యాలయం దరఖాస్తు చేసుకోవాలని వివరిచారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్ 0863235 8071లో సంప్రదించాలని తెలిపారు.

మా పొలాన్ని మాకు ఇప్పించండి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని క్రిస్టియన్‌పాలేనికి చెందిన నూనె నాగడుకు తన పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి కారంపూడి రోడ్డులోని సర్వే నెంబర్ 306 /7 లో ఎసి.5.81 సెంట్లు ఉంది. సదరు భూమికి నూనె వెంకయ్య ,వారి అన్నదమ్ములు కుటుంబ సభ్యులు వార సులుగా ఉన్నారు. వీరు పూర్వం బ్రిటిష్ కాలము నుండి వీళ్లే వారసులై ఉన్నారు. ఇటీవల పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పోట్ల రాధాకృష్ణమూర్తి, అతని అనుచరులు తమ వ్యవసాయ భూమి లోకి వస్తే చంపేస్తామని బెది రిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నూనె నాగడు వారసులందరూ వారి భూమి వద్దకు వెళ్లినట్లు తెలిపారు. ఆ వ్యవసాయ భూమి మీదే ఆధారపడి జీవనం సాగిసున్నామని, ఆక్ర మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు ప్రాణరక్షణ కల్పించాలని సంబంధిత అధికారులు విజ్ఞప్తి చేశారు

21,22 తేదీల్లో అంతర్ కళాశాలల మహిళల ఖో-ఖో పోటీలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఈ నెల 21 , 22వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల ఖో-ఖో పోటీలు నరసరావుపేట మండలం కేసనపల్లి గ్రామ పరిధిలోని మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు ఫార్మసీ కళా శాలలో జరగనున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాం డెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుండి 12 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు . ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున సెంట్రల్ యూనివర్సిటీ తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆర్థికపరమైన మోసాలపై ఫిర్యాదులు

జగనన్నకు చెబుదాంలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన విచారణ జరిపి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని పోలీసు సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి ఆదేశించారు. నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగాలు పేరిట మోసం, చిట్‌ల మోసాలు, ఆన్లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక, ఆస్తి, పొలం, ఆర్థిక పరమైన మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ప్రతి ఫిర్యాదు దారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి,నిర్ణీత గడువు లోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్పీలు కెవి మహేష్, బి.ఆదినారాయణ, పల్లపు రాజు, యు.రవిచంద్ర, ట్రైనీ డీఎస్పీ జగదీష్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట మండలం ఎలమందకు చెందిన ముక్కామల రామిరెడ్డికి ఉన్న లారీని కుమారుడు నడుపుకుంటూ 2 నెలలపాటు ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదని, డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. నకరికల్లు మండలం కుంకలగుంటకి చెందిన ఒక మహిళ తన భర్త అధిక కట్నం తీసుకు రమ్మని వేధిస్తున్నాడని, తన భర్తకు ఇంతకుముందే వివాహం జరిగిన విషయాన్ని చెప్పకుండా తనను రెండో వివాహం చేసుకున్నాడని తనకు న్యాయం చేయమని కోరారు.

డబ్బులు చెల్లించినా బంగారం ఇవ్వట్లేదు

పిల్లల చదువులు ,పొలం పెట్టుబడులు కోసం చిలకలూరిపేటకు చెందిన బంగారు ఆభరణాల దుకాణం యజమాని నాగ ప్రకాశరావు వద్ద 160 గ్రాముల బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రూ.6 లక్షలు తీసుకున్నానని అనుకున్న సమయానికి నగదు వడ్డీతో సహా చెల్లించినా తిరిగి ఆభరణాలు ఇవ్వకుండా 3 నెలలు నుండి తిప్పు కుంటున్నాడని బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన రమావత్ సూర్యా నాయక్, లక్ష్మీభాయ్ దంపతులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పంట పెట్టుబడులకు నగదు కావాలంటే బంగారు ఆభరణాలు కావాలని వేడుకున్నా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని చెప్పారు. చిలకలూరిపేటపోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని అన్నారు.

గుండు చేయించే ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

2021 లో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలకు గుండు చేసే ఉద్యోగం ఇప్పిస్తానని గుంటూరుకు చెందిన మధ్యవర్తి ఇంటూరి బాబ్జి ద్వారా అప్పటి ఆలయ పాలక సభ్యులు నేలపట్ల అంబికా నాగరాజుకు అప్పు చేసి రూ.15 లక్షలు ఇచ్చి మోసపోయామని మండల

కేంద్రం అమరావతి, మునుగుడు గ్రామానికి చెందిన బన్నారావూరి అనిత,శ్రీలక్ష్మి, భార్గవి, లక్ష్మీదేవిలు ఫిర్యాదు చేశారు. పాలకవర్గ సభ్యులు మారారని డబ్బులు అప్పటి చైర్మన్ సోమినాయుడుకు ఇచ్చామని అంబికా నాగరాజు చెప్పగా సోమినాయుడుని కలిశామని, కాలయాపన చేస్తూ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈ విషయమై అమరావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చెప్పారు.

మధ్యవర్తి మోసం చేశాడు

గుంటూరుకు చెందిన కాటం సుబ్బారావు, లతీష్‌లకు నాదెండ్ల మండలం గణపవరంలో ఉన్న 15 ఎకరాల పొలాన్ని మధ్యవర్తి అనంత శివయ్య ద్వారా రూ.1.60 లక్షలకు ముందస్తు కౌలు చెల్లించి పొగాకు సాగు చేశానని చిలకలూరిపేటకు చెందిన జల్లిబోయిన శంకరబాబు చెప్పారు. కౌలు నగదు తీసుకున్న శివయ్య, ఆ నగదును భూయజమానులకు చెల్లించకపోవడంతో సుబ్బారావు,లతీష్‌లు తమకు కౌలు చెల్లించాలని అడుగుతున్నారని, నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో శివయ్య పై ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి

కొడుకు, కోడలు వేధింపులు

మద్యానికి బానిసైన తమ పెద్ద కుమారుడు సాంబయ్య నగదు కోసం నిత్యం వేధింపులకు పాల్పడుతున్నాడని, కోడలు వెంకటరమణ తన భార్య చేతిని విరగ్గొట్టిందని నరసరావుపేట మండలం ఎలమంద కు చెందిన కాటం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. తమకు ఇద్దరు కుమారులు అని, ఉన్న కొద్దిపాటి పొలాన్ని వారిద్దరికి పంచి, ఎవరి ఇళ్ళు వారికి నిర్మించి ఇచ్చానట్లు చెప్పారు.

బంధువులే కాజేయాలని చూస్తున్నారు

అనారోగ్యంతో ఉన్న భర్త తనకు వారసత్వంగా వచ్చిన 4.79 సెంట్ల పొలాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేశారని, భర్త సోదరుడు గుర్రాల సుధాకర్ ఆ పొలంలోకి వెళ్ళనివ్వడం లేదని రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అరుణకుమారి ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల ద్వారా మాట్లాడి పొలం సాగు చేస్తున్నామని, అయితే, పంట చేతికి వచ్చే సమయానికి తన మరిది దౌర్జన్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిచారు. నాలుగేళ్లగా ఇదే తంతు నడుస్తోందని దీనిపై రాజుపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, పలు మార్లు ఎస్పీకి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొడుకు నుండి ప్రాణహాని

చెడు వ్యసనాలకు బానిసైన తమ కుమారుడు నాగరాజు నిత్యం మద్యం సేవించి దాడి చేస్తున్నాడని మండల కేంద్రం యడ్లపాడుకి చెందిన ఎడ్లూరు వెంకట్రావు ఫిర్యాదు చేశారు. నాగరాజుపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు చెప్పారు.

డబ్బు చెల్లించిచా రిజిస్ట్రేషన్ చేయట్లేదు

నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద సువర్ణభూమి వెంచర్ లో 150 గజాల స్థలం కొనుగోలు చేశానని, స్థలానికి రూ. 7 లక్షల నగదు చెల్లించానని డబ్బులు తీసుకున్న సువర్ణ కుటీర్ వెంచర్ డైరెక్టర్ కొండావత్ లక్ష్మణ్ నాయక్ స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని సత్తెనపల్లికి చెందిన చిరు ఉద్యోగి ఎం. కృష్ణ ఫిర్యాదు చేశారు. దీనిపై సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

చీటీ పాట డబ్బులివ్వకుండా దౌర్జన్యం

చీటీ పాట పూర్తయినా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని, ఈ విషయమై ప్రశ్నిస్తే బాలింతనని కూడా చూడకుండా దాడి చేసిందని పిడుగురాళ్లలోని లిల్లీనగర్‌కు చెందిన పఠాన్ బాజీబీ ఫిర్యాదు చేశారు.కూలి పనులు చేసు కుంటూ వచ్చిన కూలీ డబ్బులతో ఇంటికి సమీపంలో చీటి పాటలు వేసే మహిళ షేక్ మున్నీకి రూ.2 లక్షలు కట్టానని చెప్పారు. దీనిపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని చెప్పారు.

ప్రేమ పెళ్లి చేసుకుని వేధింపులు

ప్రేమ పేరిట నమ్మించి వివాహం చేసు కొని పాప జన్మించాక తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని అమరావతి మండలం లింగాపురానికి చెందిన మాధురి ఫిర్యాదు చేశారు పేకాటకు మద్యానికి బానిసై వేది ,స్తున్నాడని న్యాయం చేయాలని అమ రావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని అన్నారు.

జంగా కృష్ణమూర్తి సీటు ఆశించడంలో తప్పేమీ లేదు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురజాల నియోజకవర్గంలో తుపాను కారణంగా ఆపడం జరిగిందని, రానున్న రెండు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా ప్రతి నాయకుడుకు ముగ్గురు వాలంటీర్లను కలిపి కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జగనన్న సర్వే రిపోర్ట్ లో గురజాలలో ప్రస్తుతం మళ్ళీ ఎమ్మెల్యేగా తాను గెలిచేందుకు 61 శాతం ఉందని, హైకమాండ్ రిపోర్ట్ లో ఎక్కడ కూడా తనపై అవినీతి ఆరోపణలు లేవంటూ రిపోర్ట్ మీడియా ముందు చూపించారు. ఒకవేళ గురజాల నుండి వెళ్లాల్సి వస్తే చరిత్ర సృష్టించే వెళ్తానని చెప్పారు. గురజాల నియోజకవర్గం సీటును ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆశిస్తున్నారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై మహేశ్‌రెడ్డిని ప్రశ్నించగా ఆయన స్పందించారు. జంగా కృష్ణమూర్తి ఎంతో రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకులని, సీటు ఆశించడంలో తప్పేమీ లేదని అన్నారు. అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చిన కలిసి పని చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. మైనింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరు పర్మిషన్లు తీసుకొనే చేసుకుంటున్నారని, తనపై అవినీతి ఆరోపణలు చేసే వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.

వ్యాసరచనలో 'కృష్ణవేణి' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ

శ్రీ సత్య సాయి సేవా సమితి జూనియర్స్ కాలేజీ విద్యార్థులకు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన పోటీలు గత సెప్టెంబర్‌లో నిర్వహించారు. పల్నాడు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో కృష్ణవేణి జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థినిలు జిల్లాస్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం చేసు కున్నారు. జిల్లా స్థాయి ప్రథమ స్థానము పి తిరుమల వెంకటలక్ష్మి(సీనియర్ ఇంటర్ ఎంపిసి), జిల్లా స్థాయిలో తృతీయ స్థానం ఎ.నాగ వెంకట ప్రజ్ఞ(జూనియర్ ఇంటర్ ఎంసిపి) సాధించారని కళాశాల డైరెక్టర్లు బి.లింగారావు, బి.మల్లికార్జునరావు, కె.సాయికుమార్ తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యార్థులు ప్రతిభను వైజ్ఞానిక ప్రదర్శనలు ద్వారా మెరుగుపరచుకోవచ్చని తెనాలి మండల విద్యాధికారి-1 మేకల లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వివిఎస్ఆర్జెడిఎం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ ఎనర్జీ సోర్స్ నమూనా మొదటి స్థానంలో నిలిచింది. సంఘం జాగర్లమూడి ఉన్నతపాఠశాల ప్రదర్శించిన ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్(బ్లైండ్ లైట్) ద్వితీయ, తెనాలి ఎస్ఆర్ఎస్ఎంబి ఉన్నత పాఠశాల ప్రదర్శించిన మాన్ స్టర్ సోలార్ ట్రక్ కు తతీయ బహుమతి లభించినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఓ-2 జయంతి బాబు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలోని బాలుర ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యా శాఖాధికారులు

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని పెదనందిపాడు ఎండిఒ వై.రాజ గోపాల్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను వారు ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు విద్యా ర్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎగ్జిబిషన్లో జిల్లా స్థాయి పోటీలలో పాల్గొ నేందుకు విద్యార్థులు కె.వివేక్, జి.కిషోర్, ఒ. ప్రసాద్, పి.మల్లికార్జున రావు ఎంపి కయ్యారు. ఈ విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనాలు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ లు .డి బాలసుబ్రమణ్యం, పి జాకబ్ లు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.లక్ష్మీ దుర్గ, మండల కోఆర్డినేటర్ మల్లికార్జునరావు, గైడ్ టీచర్ ఆదాం షఫీ, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పెదనందిపాడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి లోని కెసిడబ్ల్యుఇఇఎస్ హైస్కూల్ లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ చూపరులను ఆకటుకున్నాయి. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సదరన్ సైన్స్ ఫెయిర్ పేరిట తాడేపల్లి మండల స్థాయిలో ఈ సైన్స్ ఎగిబిషన్ నిర్వహించారు. మండలం లోని ఆరు ఉన్నత పాఠశాలలు, ఐదు యుపి పాఠశాలల విద్యార్థులు వారు రూపొందించిన వాటిని ఈ సైన్స్ ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన 25 మంది సైన్స్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్న ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ను ఎంఇఒ-11 శాంతకుమారి, ఎంఇఒ-2 నాగేశ్వర రావు పరిశీలించి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కెసిడబ్ల్యుఇఇఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి చలపతిరావు పర్యవేక్షణలో ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.

రుణాల మంజూరు కోసం చర్మకారుల వినతి

ప్రజాశక్తి-మంగళగిరి

అమరావతి రాజధాని ఉద్దండరాయపాలెంలోని కార్యాలయంలో ఎంపి నందిగం సురేష్‌ను సోమవారం ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు కలిశారు. చర్మకారులు, డప్పు కళాకారులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల నుంచి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి మాదిగల ఆర్థిక సంక్షేమం కోసం వచ్చిన నిధుల నుండి చర్మకారులు, డప్పు కళాకారులకు రుణాలు మంజూరు చేయించాలని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎం. నాగార్జునకు రుణాలు మంజూరు కోసం సిఫార్సు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని 250 మంది చర్మకారులు, డప్పు కళాకారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున రుణం మంజూరు చేయించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో వైసిపి జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదం ఉన్నారు.

యువగళం సైనికులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తాడేపల్లి

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 226 రోజులు కొనసాగి 3132 కిలోమీటర్ల మేర దిగ్విజయంగా కొనసాగి విశాఖ జిల్లా ఆగనంపూడి వద్ద పూర్తయింది. ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన నైట్ హాల్ట్ బాధ్యతలను దిగ్విజయంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించిన గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్‌కు జెఎస్ఆర్ యువసేన తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సామాజిక పింఛన్ పెంచండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో సోమ వారం సామాజిక పెన్షన్, వృద్ధాప్య , వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లు కింద ఇచ్చే రూ.2,750 ఏమాత్రం సరి పోవ ట్లేదని రూ.6000కు పెంచి ఇవ్వాలని సిపిఐ నాయకులు కోరారు. పెద వడ్లపూడి సచివాలయంలో సామాజిక పెన్షన్ల దారులతో కలిసి అర్జీలు సచివాలయ అడ్మిన్‌కు అందజేశారు. వికలాంగుల పెన్షన్ రూ. 7 వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, జవ్వధి సాంబశివరావు పెన్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

తిరిగి పుంజుకుంటున్న పసుపు ధరలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

నాలుగు నెలల క్రితం 11 వేల రూపాయలకు చేరిన పసుపు ధరలు ఆ తర్వాత క్రమంగా తగ్గాయి. తిరిగి క్రమంగా పుంజుకుంటూ సోమవారం రూ. 10,711 గరిష్ట ధరకు చేరుకున్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్లో 10711 రూపాయలు పలికినప్పటికీ ప్రైవేటుగా 11 వేల రూపాయలు పలికింది. దీనితో ధరలు ఇంకా పెరుగ వచ్చునని రైతులు వ్యాపారస్తులు అభిప్రాయపడు తున్నారు. సోమవారం పసుపు కొమ్ములు 432 క్వింటాళ్లు దుంపలు 613 క్వింటాళ్లు అమ్మకాలు జరిగాయి. పసుపు కొమ్ములు కనిష్ట ధర రూ.8,550, గరిష్ట ధర రూ.10,711 సగటు ధర రూ.10,150, దుంపలు కనిష్ట ధర రూ.8,5 50 గరిష్ట ధర రూ.10,700, సగటు ధం రూ.10,150 పలికాయి.

వ్యవసాయ మార్కెట్ యార్డులో కాటాలు వేస్తున్న హమాలీలు

మొబైల్ టెక్నాలజీపై అవగాహన అవసరం

కెఎల్ టిఫ్ సిఇఒ అలోక్ గోవిల్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వెబ్,మొబైల్ అప్లికేషన్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కెఎల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఫౌండేషన్ సిఇఒ అలోక్ గోవిల్ అన్నారు. సోమవారం వర్సిటీలోని సెమినార్ హాల్‌లో జరిగిన వెబ్, మొబైల్ అప్లికేషన్‌లపై మూడు రోజుల వర్క్‌షాపు ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా అలోక్ గోవిల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వెబ్ సర్వీసు, మొబైల్ అప్లికేషన్‌లకు డిమాండ్ పెరుగుతుందన్నారు. ఆ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. వర్క్‌షాప్‌లో ఆసక్తి కలిగిన వారికి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కాన్సెప్ట్‌లపై విలువైన అంతరదృష్టిని అందించడంతో పాటు వెబ్, మొబైల్ అప్లికేషన్‌ల కోసం పూర్తి-స్టాక్ డెవలప్‌మెంట్‌లో ఆచరణాత్మక, ప్రయోగాత్మక శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎసిఐసి సిఇఒ రమణ్ కాంత్ , కెఎల్ టిఫ్ మేనేజర్ మహేష్ గౌడ్ , సింగిమాక్సిమ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపి నేతలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు నియోజకవర్గంలో ధూళిపాళ్ళ నరేంద్ర, వైసిపి సానుభూతిపరుల ఓట్లు తొల గించుటకు కుట్రలు చేస్తున్నాడని, వారి అనుచరులచే ఇష్టారీతిగా భారీగా ఫారం 7 దరఖాస్తులను పెట్టిస్తున్నాడని సోమ వారం జరిగిన స్పందన కార్యక్రమంలో వైసిపి నాయకులు ఫిర్యాదు చేశారు. వైసిపి ఓట్లు తొలగింపులో మన్నవలోనే సుమారు 129 ఫారం 7 దరఖాస్తులు పెట్టారని, నరేంద్ర ప్రధాన అనుచరుడు టిడిపి మండల పార్టీ అధ్య క్షుడు బండ్లమూడి బాబూరావు ఆయన కుటుంబ సభ్యులు మాత్రమే ఈ ఫారం 7 దరఖాస్తులను పెట్టడం చూస్తే, నరేంద్ర ఏ విధంగా అక్రమాలకు పాల్పడుతున్నాడో అర్థమౌతుందని అన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరు 5కు మించి,పరిధి దాటి ఇష్టారీతిగా 40 నుంచి 50 వరకు ఫారం 7 దరఖాస్తులను పెట్టినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.



రజక వృత్తిదారుడు సుబ్బారావు మృతికి నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధానిలోని ఎర్రబాలెంలో రజక వృత్తి చేస్తూ, బట్టలు ఇస్త్రీ చేసే మంచి క ల పూడి చిన్న సుబ్బారావు సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సుధారాణి ఎర్ర బాలెంలో మున్సిపల్ కార్మికురాలుగా పనిచేస్తున్నారు. సుబ్బారావు భౌతిక కాయం వద్ద రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎంరవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాజధాని ప్రాంత కార్యదర్శి తోకల బాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎర్రబాలెం అధ్యక్ష,కార్యదర్శులు ఒ.రామారావు, టి.ఆదిలక్ష్మి, నాయకులు కె.కోటేశ్వరి, ఎన్.దివ్య, ఎం.పార్వతి మున్సిపల్ కార్మికులు, రాచకొండ శివ నివాళులర్పించారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

కొనసాగుతున్న సంక్షేమ బోర్డుల ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డుల ప్రదర్శన సచివాలయాల వద్ద కొనసాగుతోంది. దీనిలో భాగంగా సోమవారం స్థానిక తొమ్మిదవ వార్డు లక్ష్మీ నగర్ లోని పదవ సచివాలయం వద్ద రూ.23.55 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించారు. అలాగే 37వ వార్డు భవనం వారి వీధిలోని 42వ సచివాలయం వద్ద రూ.21.56 కోట్ల విలువైన సంక్షేమ పథకాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల వద్ద ఏర్పాటుచేసిన సభలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మద్దాలి శేషాచలం, ఎం సువర్ణరేఖ దేవి, మహబూబ్ బాషా, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం ఎంటర్ ప్రెన్యూర్ షిప్ నూతన డైరెక్టర్ గా ఎస్ఎస్ త్రిపాఠి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



ఎపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ విభాగం నూతన డైరెక్టర్‌గా సిద్ధార్థ్ శంకర్ త్రిపాఠి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎంతో పేరున్న ఎస్ఎస్ త్రిపాఠి ఏపీ ఎస్ఆర్ఎంలో డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం తమకెంతో సంతోషంగా ఉందని యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి .సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాలు ఆనందం వ్యక్తం చేశారు. హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అయిన త్రిపాఠికి ఎంటర్ ప్రెన్యూర్ షిప్ రంగంలో విశేషమైన అనుభవం ఉంది. ఆసియాలో మొట్టమొదటి సేల్స్ అండ్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్ కంపెనీ బ్రాండ్ గైన్ ను, గ్లోబల్ న్యూస్ సోర్స్ అయిన న్యూస్ వార్మ్ ను స్థాపించిన వ్యక్తిగా త్రిపాఠికి దేశీయంగా ఎంతో పేరుంది.

సమస్యను గడువులోగా పరిష్కరించాలి : జెసి

గుంటూరు జిల్లా కలెక్టర్ స్పందనకు 208 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాజకుమారి తదితరులు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, కె.స్వాతి, ఆర్డీఓ పి.శ్రీఖర్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 208 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలను క్షుణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, పీడీ హౌసింగ్ వేణుగోపాల్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డియంఅండ్‌హెచ్ డాక్టర్ శ్రావణబాబు, పంచాయితీరాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నియామక పత్రం ఇచ్చినా ఉద్యోగం ఇవ్వలేదు

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా తనకు ఉద్యోగ నియామక పత్రం ఇచ్చినా ఇంత వరకూ పోస్టింగ్ ఇవ్వలేదని తుమ్మలచెరువుకు చెందిన అంధురాలు నెమలికంటి పవిత్రి స్పందనలో అర్జి అందచేసింది. ఈ ఏడాది ఆగస్టు 26న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో తనకు నియామక పత్రం ఇచ్చారన్నారు. మొదట పోస్టింగ్ కోసం ఆచార్య నాగార్జునా యూనివర్శిడీ, తర్వాత ఎడి ఆఫీసు చుట్టూ నాలుగు సార్లు తిరిగినా జాబ్ ఇవ్వలేదన్నారు. కావున తనకు పోస్టింగ్ ఇవ్వాలని కోరింది.

మోటారు వాహనం ఇప్పించాలి

ఆరు నెలలుగా మూడు చక్రాల మోటారు వాహనం కోసం తిరుగుతున్నా ఇవ్వట్లేదని గుంటూరుకు చెందిన వికలాంగుడు ఏసోబు స్పందనలో అర్జీ అందచేశాడు. ఆరు నెలల క్రితం వాహనం కోసం అర్జీ పెట్టుకున్నానని, తనతోపాటు దరఖాస్తు చేసుకున్న అనేక మందికి ఇచ్చారని తనకు మాత్రం ఇవ్వలేదన్నారు. సైకిల్ షాపులో రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నానని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అగ్రిగోల్డ్ బాధితులకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. కంపెనీకి చెందిన రూ.30వేల కోట్లు ప్రభుత్వం చేతిలో ఉండి వాటి నుండి రూ.3080 కోట్లు ఇచ్చి బాధితుల్ని ఆదుకోలేకపోవటం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. రూ.20వేల లోపు, రూ.20వేలు పైన మిగిలి ఉన్న బాధితులకు ఫలానా తేదీలోగా డిపాజిట్లు చెల్లించే ప్రకటన చేయాలని, సిఎం హామీ మేరకు అసహజ మరణాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర , జిల్లా గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో చైర్మన్ విద్యాసాగర్, విద్యార్థులు

21 నుండి వివిఐటిలో జాతీయ స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి : వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల (వివిఐటి) నంబూరులో 21 నుంచి జాతీయ స్థాయి యువజనోత్సవం 'వివా వివిఐటి 2కే 23-24' నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. సోమవారం కళాశాలలో మీడియాతో ఆయన మాట్లాడారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్), విద్యార్థి విభాగం సంయుక్తంగా నిర్వహించే యువజనోత్సవం విద్యార్థుల సామర్థ్యం, వారి మధ్య ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఈ వేడుకలు విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. సాంకేతిక, క్రీడా, సాంసస్కృతిక విభాగాల్లో మొత్తం 90 అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 21, 22 తేదీల్లో యువజనోత్సవం నిర్వహించటంతో పాటు 23న కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిఐటి కన్వీనర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ యువజనోత్సవాల్లో పాల్గొనే విద్యార్థులు 'వివిఐటి గుంటూరు డాట్‌నెట్' లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు గుంటూరు, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. శాక్ విద్యార్థి విభాగం బాధ్యులు ఎం.ఈశ్వర్ మాట్లాడుతూ యువజనోత్సవానికి ఎంతో ప్రత్యేకత ఉందని, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విద్యార్థుల సహకారంతో రెండు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉత్సవం జరుగుతుందన్నారు. అనంతరం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, డాక్టర్ ఎంవై భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ కార్డులు

గుంటూరులో లబ్ధిదారులకు కార్డులు అందజేసిన కలెక్టర్ - పల్నాడు జిల్లాలో కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ తదితరులు

లబ్ధిదారులకు కార్డులు అందచేస్తున్న గుంటూరు కలెక్టర్, ఇతర అధికారులు

జగనన్న సురక్ష బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు : ఆరోగ్యశ్రీ కింద రూ.25లక్షల వరకు ఉచిత వైద్యంపై అవగాహన, కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యంపై అవగాహన, కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, ఎమ్మెల్యే ముస్తఫా, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సహాయ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి 15 మంది లబ్దిదారులకు స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రేపటి నుండి ఇంటింటికీ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని వైద్య శాఖాధికారులను ఆదేశించారు. కార్డుల పంపిణీ, ఆరోగ్యశ్రీ యాప్‌తో పాటు దిశ యాప్ డౌన్‌లోడ్ అయ్యేలా మహిళా పోలీస్, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, అశావర్కర్లు, వాలంటీర్ల ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుని ఫోటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పొందుపరిచిన లబ్ధిదారుని ఆరోగ్య వివరాలు వుంటాయన్నారు. అలాగే జనవరి 1 వ తేది నుండి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 ను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ జె. మోహనరావు, డియం అండ్ హెచ్ డాక్టర్ శ్రావణ బాబు, డిఐపియం రత్నమన్మోహన్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ విజయ్ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి ఆరోగ్య శ్రీ కింద రూ 25 లక్షల వరకు ఉచిత వైద్యం , కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంచనంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. నరసరావుపేట కలెక్టర్ కార్యాలయములో యస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి వర్చువల్ విధానంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, ఎస్‌పి వై రవిశంకర రెడ్డి, జెసి ఎం శ్యాంప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి రవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ కార్డులు త్వరిత గతిన అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఆరోగ్య శ్రీ యాప్,దిశా యాప్ ఉండేలా చూడాలన్నారు. ముందుగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందే కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రైతు, కౌలు రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- 21,22 తేదీల్లో సచివాలయాల వద్ద ధర్నాలకు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - మంగళగిరి

తుపానుతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని కోరుతూ 21, 22 తేదీల్లో సచివాలయాలు వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షతన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలో తుపాను వలన వరి, మిర్చి, పొగాకు, పత్తి, అరటి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులు చేతికొచ్చే పంట నీటిపాలవడంతో, అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులు చెల్లించే దారిలేక ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఒకవైపు నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతూనే మరోవైపు అనేక నిబంధనలు పెడుతున్నారని విమర్శించారు. కార్డు ఉంటేనే కౌలురైతుకు పరిహారం అనేది సరికాదని, సచివాలయ అధికారులతో సర్వే చేసి నిజ సాగుదారుని గుర్తించి నష్టపోయిన రైతుల్ని ఆదు కోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంటల బీమ సౌకర్యం కల్పిస్తానని చెప్పి ఇంతవరకు కల్పించలేదని ఇది పెద్ద స్కాంగా ఉందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఆచరణలో రైతుకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల నీరు పోక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తుపాను ముందు తీసుకోవాల్సిన చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోలేదని, కనీసం రైతులకు అవసమైనన్ని టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వకపోవడంతో నష్టం మరింత పెరిగిందన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలు రద్దు చేసి తిరిగి కొత్త రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు వలసలు పోతున్నారన్నారు. వారికి ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారం కోరుతూ డిసెంబర్ 21, 22 తేదీల్లో ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రైతు, వ్యకాస, సంఘం జిల్లా కార్యదర్శులు కంచుమాటి ఆజయ్ కుమార్, ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగమల్లేశ్వరరావు, నాయకులు దుర్గారావు, కె ప్రకాష్‌రావు, ఈ కాటం రాజు, ములకా శివసాంబిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాధాకృష్ణ, గోపాలరావు

ప్రజాశక్తి-సత్తెనపల్లి: మిచౌంగ్ తుపాన్‌తో పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు వెంటనే గుర్తించి నష్ట పరిహారం అందజేయాలని 20, 21 తేదీలలో అన్ని సచివాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆయా సంఘాల సంయుక్త సమావేశం సోమవారం స్థానిక పుతుంబాక భవన్లో జరిగింది. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏవిఎన్ గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రబీలో వేసిన పంటలు నమోదు కాలేదని ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రకాల పంటలను ఈ - క్రాప్ లో నమోదు చేసి పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో లక్షలాది ఎకరాలు పంటలు వేయకుండా పడావుగా పడి ఉన్నాయని వారిని రైతులందరిని గుర్తించి కరువు సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారానికి 20, 21తేదీలలో గ్రామ సచివాలయాల వద్ద జరిగే ధర్నాలో రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులందరూ పాల్గొని తమ సమస్యల పై అధికారులకు వినతి పత్రాలు అందజేసి ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.